క్లుప్తంగా

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : గత నెల వరంగల్‌లో నిర్వహించిన కియో జపాన్ చోటో ఖాన్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

చివ్వెంల : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో మహిళా స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి జి.కళారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఎడవ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ 7వ తేదీలోపు కస్తూరిబాగాంధీ పాఠశాలలో విద్యార్హత సర్టిఫికేట్, రెండు పాస్‌ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు స్థానికులై ఉండాలని పేర్కొన్నారు.

నేడు ట్రాక్టర్ యజమానులకు శిక్షణ

అర్వపల్లి : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' ఇసుక టాక్సీ విధానంపై శనివారం శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ శిక్షణకు ట్రాక్టర్ యజమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో శనివారం(నేడు) ఉదయం 11 గంటలకు జరిగే తుంగతుర్తి నియోకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని 9మండలాల ముఖ్యనాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీడీఓ పవన్‌కుమార్

అర్వపల్లి : ఉపాధి హామీ పథకం కింద 2025–26 సంవత్సరానికి గాను పనుల గుర్తింపు కోసం శుక్రవారం వేల్పుచర్లలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పనులపై చర్చించారు. ప్రజలకు ఉపయోగకరమైన పనులను చేపట్టాలని నిర్ణయించారు. ఈ గ్రామసభలో ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్, ఈసీ నగేష్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, టెక్నికల్ అసిస్టెంట్ నాగమణి, ఉపాధిహామీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి

అర్వపల్లి : కోడూరులో సుమారు రూ.2కోట్ల వ్యయంతో పునర్నిర్మిస్తున్న శంభులింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు, భక్తులు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి కోరారు. శుక్రవారం బెంగళూరుకు చెందిన తన మిత్రుడు, బిల్డర్ బీవీఎస్ రెడ్డి నుంచి రూ.2,01,116, అలాగే పైళ్ల పృథ్వీరెడ్డి నుంచి రూ. 1,01,116 చొప్పున విరాళాలను ఆలయ పునర్నిర్మాణ పనులకు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంతెనపై గుంతలు.. రాకపోకలకు ఇబ్బందులు



వంతెనపై సీసీ లేచిపోయి ఏర్పడిన గుంతలు

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ జాతీయ రహదారి నుంచి పర్సాయపల్లి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డులో ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువ మీద నిర్మించిన వంతెనపై సీసీ లేచిపోయి గుంతలేర్పడి ప్రమాదకరంగా మారింది. అలాగే ఈ వంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు కూడా బీటీ లేచిపోయి పెద్దపెద్ద గుంతలేర్పడ్డాయి. వర్షాలకు ఈ గుంతలు మరింత పెద్దవవుతున్నాయి. ఇప్పటికైనా గుంతలను పూడ్చి వేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పత్తి రైతుకు దిగుబడి దిగులు

- ఈ ఏడాది పత్తి సాగుకు అనుకూలించని వర్షాలు
- పంటను తెగుళ్లు ఆశించడంతో తగ్గుతున్న దిగుబడి
- ఆందోళన చెందుతున్న రైతులు



కలుపుమయంగా మారిన పత్తిచేను

ఆత్మకూర్ (ఎస్) : నాన్ ఆయకట్టు ప్రాంతమైన ఆత్మకూరు(ఎస్) మండలంలో రైతులు రెండో ప్రధాన పంటగా పత్తిని సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సారవంతమైన నల్లరేగడి, ఎర్ర భూములు ఉన్నాయి. దీంతో రైతులు పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో అనుకూలంగా వర్షాలు పడడంతో పత్తి పంటకు మంచి దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది వర్షాలు పత్తి సాగుకు అనుకూలంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. విత్తనాలు పెట్టిన నాటి నుంచి వర్షాలు అధికంగా కురవడంతో చేనుల్లో కలుపు తీవ్రంగా పెరిగింది. పంటలకు చీడపీడలు సోకడంతో రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చేలా లేదు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పత్తి చేలు ఎర్రబారాయి. తెగుళ్ల బెడదతో అధిక పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు తెలుపుతున్నారు. దిగుబడి తగ్గి నష్టాలు పొందాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల పాలవుతున్నాం

పత్తి సాగు చేస్తే ఎలాంటి లాభం ఉండడం లేదు. వస్తే వరుసగా వర్షాలు కురవడం, లేదంటే ఎండలు కొడుతుండడంతో పత్తి పంటను సాగు చేయడం కష్టంగా మారుతోంది. చేనులో కలుపు పెరిగి ఆశించిన దిగుబడి రావడం లేదు. పెట్టుబడి ఖర్చులు అధికం అవుతున్నాయి. - ఉప్పల శ్రీశైలం, రైతు



నష్టపోవాల్సి వస్తోంది

మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఈ సంవత్సరం అధిక వర్షాల కారణంగా పంటకు చీడపీడలు అధికమయ్యాయి. దీంతో పెట్టుబడి పెరిగింది. దిగుబడి తగ్గింది. ఎకరానికి ఏడు క్వింటాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పత్తి సాగు చేస్తే అప్పుల పాలు కావాల్సి వస్తుంది. - సైదులు, తుమ్మల పెన్‌పహాడ్



ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి



ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తల్లమల్ల హస్సేన్, తదితరులు

సూర్యాపేట టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా వెంటనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్, దళిత బహుజన శ్రామిక యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఓట్ల కోసం దళిత, గిరిజనులకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు.

స్కూళ్లలో పనులకు పూర్వవిద్యార్థుల తోడ్పాటు



పాఠశాలలో గోడకు రంగులు వేసే పనులను ప్రారంభిస్తున్న మండల నోడల్ అధికారి ప్రభాకర్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల ప్రహరీకి రంగులు వేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. ఆ పనులను మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్‌లు కుంభం వెంకటరమణ, కాగితాల కరుణశ్రీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ రెండు పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, మామిడి సత్యనారాయణ, చింత నర్సయ్య, బింగి కృష్ణమూర్తి, నర్సింగ వెంకన్న, బింగి సోమయ్య, నవీన్, ఆంజనేయులు, నరేష్, వీరయ్య, సురేష్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల్లో న్యాయవాదుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కుంట్ల ధర్మార్జున్

భానుపురి : భారత స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ విముక్తి వరకు ప్రజాస్వామిక ఉద్యమాల్లో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని తెలంగాణ జన సమితి ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ లీగల్ సెల్ జిల్లా కమిటీ నిర్మాణ సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తులు అని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో గత పది సంవత్సరాల కాలంలో కనీస ప్రజాస్వామిక విలువలు లేకుండా కేసీఆర్ అణచివేత పాలన కొనసాగించాడని తెలిపారు. అనంతరం లీగల్ సెల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంచం చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నాగుల్ పాషా, ఉపాధ్యక్షులుగా ధరావత్ వీరేష్ నాయక్, బొజ్జ అనిల్, భాషబోయిన వేణురాజు, సహాయ కార్యదర్శులుగా మంగు నాయక్, సుధాకర్ గౌడ్, సతీష్‌యాదవ్, కార్యవర్గ సభ్యులుగా నవీన్, శ్రీనివాస్, బచ్చలకూరి గోపి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, జన సమితి జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, లీగల్ సెల్ నాయకులు వీరేష్ నాయక్, బొజ్జ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడి



సర్వే నిర్వహిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : వరిలో డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్తలు డి.నరేష్, ఎ.కిరణ్ తెలిపారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని మండలంలోని దూపహాడ్, లింగాల గ్రామాల్లో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటల్లో బెంచ్ మార్క్ సర్వే నిర్వహించారు. నేల రకం, విత్తనాల రకాలు, ఎరువుల వాడకం, చీడపీడల సమస్య, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్య పద్ధతులు తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు జి.సంతోష్, శ్రీకాంత్, అజయ్, రైతులు దొంగరి అరవింద్, ఎం. శంకర్, వీరయ్య, బిట్టు వెంకన్న, గుండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికార, ప్రతిపక్షాలు హుందాగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

చివ్వెంల : అధికార, ప్రతిపక్ష నాయకులు హుందాగా వ్యవహరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మహాశాఖ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయాల్లో నైతిక విలువలు దిగజారుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలే అందుకు నిదర్శనం అన్నారు. బడా బాబులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం వదలి వెయ్యకూడదని, అదే విధంగా పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతే గుడిసెలు తొలగించాలని కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రజలకోసం పనిచేయాలే తప్పా విమర్శలే ప్రధాన అస్త్రంగా మాట్లాడకూడదని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తాము అధికారంలో ఉన్నట్లు భ్రమ పడుతున్నారని, దాని నుంచి బయటకు రావాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం గ్రామ కార్యదర్శిగా బొప్పని సులేమాన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇట్టమళ్ల స్టాలిన్, ఎసోబ్, వేల్పుల వెంకన్న, బచ్చలకూరి రాంచరణ్, అమ్మయ్య, నారాయణ, నవీన్, యేసు, లింగయ్య, వరుణ్, అన్నపూర్ణ, వనజ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి బృందం కళాజాతా



అర్వపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సారథి కళాకారులు

అర్వపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా బాధ్యుడు ఈర్ల సైదులు కోరారు. శుక్రవారం అర్వపల్లిలో మాదక ద్రవ్యాల నిషేధం, గంజాయి నియంత్రణ, పారి శుద్ధ్యం, ఆరోగ్యం తదితర అంశాలపై సాంస్కృతిక కళాబృందం ఆధ్వర్యంలో ఆటా–పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళా ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు కె.నాగరాజు, ఎం.శంకర్, జి.ఉదయ్, పి.శ్రీకాంత్, మేడిపల్లి వేణు, పి.ఉపేందర్, మంజుల, రాధ, స్రవంతి, శిరీష, స్థానికులు పాల్గొన్నారు.

గాయత్రీ దేవి అవతారంలో దుర్గామాత

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గామాత గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామాల్లో అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



తిరుమలగిరిలో పూజలు చేస్తున్న భక్తులు



నూతనకల్ : అల్లునూరులో..



నాగారం : మాచిరెడ్డిపల్లిలో..

తుంగతుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే మందుల సామేల్
- కలెక్టర్‌తో కలిసి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన



రుద్రమదేవి చెరువు వద్ద ప్రభుత్వ భూమి రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తుంగతుర్తి : తుంగతుర్తి ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం వెలుగుపల్లి గ్రామ శివారులోని రుద్రమ్మ చెరువు సమీపంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఈ ప్రాంతం అనువైనదిగా ఉందని అన్నారు. రుద్రమ్మ చెరువును రిజర్వాయర్‌గా చేసేందుకు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి రాసిన బతుకమ్మ పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ పార్క్ జనరల్ మేనేజర్ నాగరాజు, తహసీల్దార్ దయానంద్, ఎంపీడీఓ శేషుకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సుంకరి జనార్దన్, ఉప్పుల రాంబాబు,. చింతకుంట్ల వెంకన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



సూర్యాపేటటౌన్ : బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న శ్రీమేధా జూనియర్ కళాశాల విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీమేధా జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగరంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జాకీర్‌హుస్సేన్, కరస్పాండెంట్ బిట్టు నాగేశ్వర్‌రావు, డైరెక్టర్లు బిట్టు హరీష్, రెబ్బ కృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధి ఆదర్శనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కందుకూరి మంగమ్మ మాట్లాడారు. బతుకమ్మను అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గిలకత్తుల కవిత, హెల్పర్ బోళ్ల రాములమ్మ పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం తూర్పుతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ గుగులోతు జ్యోతితో పాటు చిన్నారులు బతుకమ్మలు పేర్చి ఆడారు. ఈ కార్యక్రమంలో ఆయా, తండా గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి అంగన్‌వాడీ కేంద్రంలో..



అర్వపల్లి: తూర్పుతండా అంగన్‌వాడీ కేంద్రంలో..

ఏపూరు వాసికి డాక్టరేట్



లింగయ్య

ఆత్మకూర్ (ఎస్) : నిరుపేద కుటుంబానికి చెందిన బొంత లింగయ్య ఉస్మానియా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించాడు. 'సింథసిస్ ఆఫ్ యాంటీ కేన్సర్ యాక్టివిటీ ఆఫ్ డ్రగ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గానూ శుక్రవారం ఆయనకు డాక్టరేట్ లభించింది. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన ఆయన సీఎస్ఐఆర్‌లో ఆలిండియా 63వ ర్యాంకు సాధించాడు.

సీపీఎం కార్యాలయ భవన నిర్మాణానికి దాతల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీపీఎం కార్యాలయ భవన నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆ పార్టీ గ్రామ కార్యదర్శి కొమ్ము విజయ్‌కుమార్ కోరారు. గ్రామానికి చెందిన తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుడిపల్లి సోమిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డిలు శుక్రవారం పార్టీ గ్రామశాఖకు రూ.15,016 విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, సీపీఎం నాయకులు శిగ వెంకన్న, శ్రీను, రవి, పగిడిమర్రి శేఖర్ పాల్గొన్నారు.

పెంచిన పింఛన్ ఇవ్వాలి

పెన్‌పహాడ్ : కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులకు, వికలాంగులకు పెంచిన పెన్షన్ వెంటనే విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇస్తామన్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేద రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేకు ప్రజలు సహకరించి వివరాలు అందించాలని తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామంలో రెండో రోజు కుటుంబ డిజిటల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సర్వేలో ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలు ఇచ్చి ఫొటో దిగాలన్నారు. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాల విషయంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు కుటుంబానికి రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంజీవయ్య, ఆర్ఐలు రంజిత్‌రెడ్డి, అజీజ్‌ఉన్నిసా, స్వప్న, శ్రీనివాస్, ఎంపీఎస్ఓ రాధా, సీనియర్ అసిస్టెంట్ రాధా, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

తిరుమలగిరి : మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన వే ముల జలంధర్‌కు మంజూరైన రూ.23,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే సామేల్ తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుడి కుటుంబానికి అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దిరాల : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఎం.వీరన్న తెలిపిన ప్రకారం.. ముకుందాపురం గ్రామానికి చెందిన నాగయ్య తన సొంత ట్రాక్టర్‌లో గ్రామ శివారులోని పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు.

రెగ్యులరైజేషన్ చేసుకోవాలి

మునగాల : అనుమతి లేని లేఅవుట్‌లలో ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష కోరారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు ఆకుపాముల లోని ప్లాట్లను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ కార్యాలయానికి 1158 దరఖాస్తులు అందాయన్నారు.

శిథిలావస్థలో జాజిరెడ్డిగూడెం పంచాయతీ భవనం



శిథిలమైన జాజిరెడ్డిగూడెం జీపీ భవనం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలమైంది. 60 ఏళ్ల కిందట ఈ భవనాన్ని డంగు సున్నంతో నిర్మించారు. అయితే మరమ్మతులు లేకపోవడంతో కాలం తీరిపోయి కూలే దశకు చేరింది. భవనం పైభాగంతోపాటు గోడలకు సిమెంటు పెచ్చులూడి పడుతున్నాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు శిథిలమైన భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పెచ్చులూడుతున్న సర్పంచ్ గది